క్లుప్తంగా

టైరు పేలి బియ్యం ఆటో బోల్తా

● డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



టైరు పేలి బోల్తా కొట్టిన బియ్యం లోడు ఆటో

పొన్నలూరు: బియ్యం బస్తాల లోడుతో వెళ్తున్న ఆటో టైరు పేలి బోల్తాకొట్టింది. ఈ సంఘటన పొన్నలూరు చెరువు కట్ట సమీపంలోని టీవీ రోడ్డుపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు పరిశీలిస్తే.. బియ్యం బస్తాల లోడుతో ఆటో కనిగిరి నుంచి కందుకూరు వెళ్తుంది. ఈ క్రమంలో పొన్నలూరు చెరువు కట్ట సమీపంలోకి రాగానే ఆటోలో బరువు ఎక్కువగా ఉండటంతో ఒక్కసారిగా వెనుక టైరు పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో ఆటో ఒక్కసారిగా బోల్తా కొట్టింది. దీంతో ఇది గమనించిన వాహనదారులు బోల్తా కొట్టిన ఆటోలో నుంచి డ్రైవర్‌ను బయటకు తీశారు. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సరైన పత్రాలు లేకుంటే జరిమానా

కందుకూరు: వాహనాలకు సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తే భారీ జరిమానాలు విధిస్తామని కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రఫీ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీలను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానాలు విధించారు. ఇతర రవాణా వాహనాల వద్ద సరైన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోవడాన్ని గుర్తించి జరిమానాలు వేశారు. పత్రాలన్నీ వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలని, లేకుంటే సీజ్ చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

సచివాలయాలు ఆకస్మిక తనిఖీ

వెలిగండ్ల: సచివాలయ ఉద్యోగులు అంకితభావంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని రామగోపాలపురం, ఇమ్మడిచెరువు, పి.రాళ్లపల్లి, పి.నాగులవరం, గుడిపాటిపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ టి.సుకుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని కూటాగుండ్ల, సీతారాపురం సచివాలయాలను, డంపింగ్ యార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది హాజర్ పట్టి, విధి నిర్వహణల రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల రికార్డులు, ప్రభుత్వ సేవా సర్వీస్ రికార్డులు పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి విధి నిర్వహణలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సర్పంచ్ గాలం రామక్రిష్ణ, కార్యదర్శులు అశోక్, రామ్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య

లింగసముద్రం: వేసవి కాలం వస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. పెదపవని ఎస్సీ కాలనీలోని మంచినీటి బోరు పనికి రాకుండా పోయిందని, అక్కడే కొత్తగా మరో బోరు ఏర్పాటు చేస్తే కాలనీ వాసుల ఇబ్బందులు తొలుగుతాయని జెడ్పీటీసీ డాక్టర్ చెన్ను నళినీ పద్మ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌ఆర్‌పాలెం గ్రామంలో మంచినీటి పైపులైన్ లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతుందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకొని లీకేజీ లేకుండా చూడాలని సర్పంచ్ చింతగుంపల అంజమ్మ కోరగా, లీకేజీ లేకుండా మరమ్మతులు చేయిస్తామని ఏఈ చెప్పారు. అన్నెబోయినపల్లెలో వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో మురుగు నీరుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకురాగా.. సిమెంట్ రోడ్డు హెచ్చుతగ్గులుగా వేయడంతో నీరు నిల్వ ఉంటుందని, మళ్లీ రోడ్డు వేసేలా ప్రతిపాదనలు పంపామని చెప్పారు. తిమ్మారెడ్డిపాలెం కొత్త చెరువుకట్ట గుంతలుపడి అధ్వాన్నంగా తయారైందని, కట్టపై నాలుగైదు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని కట్టకు గ్రావెల్ తోలి గుంతలు పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ శేషుబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొన్నలూరు మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం 908 గృహాలు మంజూరు చేసిందన్నారు. ఇందులో 671 మంది నిరుపేదలకు జగనన్న లేఅవుట్ల ద్వారా స్థలం కేటాయించి పట్టాలు మంజూరు చేశారన్నారు. వీరిలో ఇప్పటి వరకు 132 మంది బేస్‌మెంట్, 25 మంది రూఫ్ లెవల్, 34 మంది స్లాబ్‌లు, 160 మంది పూర్తిగా గృహాలు నిర్మించారన్నారు. వీరికి బిల్లులు కూడా ప్రభుత్వం వెంటనే చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



పొన్నలూరులో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరావు

వాటర్ కూలింగ్ బాక్స్ బహూకరణ

కనిగిరి రూరల్: మండలంలోని పాతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత నాదేళ్ల తిరుపతిరావు బుధవారం వాటర్ కూలింగ్ బాక్స్‌ను బహుకరించారు. అలాగే ఎన్‌ఎంఎంఎస్‌లో ఎంపికైన ఇద్దరు విద్యార్థులు కె.ఓబుల్ చందు, ఎం పవన్ కుమార్‌లకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

వీసీపల్లి: ఉపాధి హామీ పథకానికి రూ. 2లక్షల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గుంటుపల్లిలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి మాట్లాడుతూ ఉపాధి హామీ పరిరక్షణకై ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

టంగుటూరు: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు భాగ్యనగర్‌లో 2023 ఏప్రిల్ 10 నుంచి 30 రోజులు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితం, ప్రకాశం జిల్లాకి చెందిన మహిళలకు మాత్రమే, వయస్సు 19 నుంచి 45 మధ్య కలిగిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9573363141 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఓ వినయ్ బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఏప్రిల్ నుంచి ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతున్నందున ప్రతి కూలీకి పని కల్పించేలా పనులు గుర్తించాల్సిన బాధ్యత ఫీల్డు అసిస్టెంట్‌లదేనన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నాటికి పనికి వచ్చే ప్రతి కూలీకి సరాసరిన రూ. 250 కూలి అందిందన్నారు. మండలంలో అత్యధిక కుటుంబాలకు 100 రోజుల పని కల్పించామన్నారు. ఏప్రిల్ నుంచి జరిగే పనులకు కూడా కూలీ నగదు రూ. 257 పడేలా చూడాలన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా

సింగరాయకొండ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఊళ్లపాలెం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా అన్నారు. మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ బావి వద్ద పల్లెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్ రిజ్వానా మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాయని గుర్తు చేశారు. పాలు, గుడ్లు, బలవర్ధకమైన రాగిపిండి, బెల్లం, చిక్కీలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. శానంపూడి, సోమరాజుపల్లి, బింగినపల్లి, ఊళ్లపాలెం గ్రామాల కార్యకర్తలు షేక్ ఖమురున్నీసా, అరుణ, పద్మ, వెంకాయమ్మ పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి

కందుకూరు రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. పోషక పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని దొండపాడులో అవగాహన కార్యక్రమంనిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి పోషక విలువలు ఉన్న ఆహారం ప్రతి రోజు అందిస్తున్నామన్నారు.

వినికిడి యంత్రం పంపిణీ



టంగుటూరులో వినికిడి యంత్రం పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామం పసుకుదురు గ్రామానికి చెందిన జిల్లా అంకయ్య వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు దృష్టికి స్థానిక నాయకులు తీసుకొచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చేతుల మీదుగా వినికిడి యంత్రం పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు బీనీడి ఉదయకుమార్, మన్నం వెంకయ్య, సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, తొట్టెంపూడి వెంకటేశ్వర్లు, తన్నీరు వీరనారాయణ, జిల్ల చంద్ర, పులిచర్ల కొటిరెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, శారీమందిర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

1న మండల సమావేశం

ఉలవపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ ఒకటిన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల పరిధిలోని అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొనాలని కోరారు.

కందుకూరు రూరల్: కందుకూరు మండల సమావేశం ఏప్రిల్ ఒకటిన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయశేఖర్ తెలిపారు. ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల సమాచారంతో హాజరు కావాలన్నారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.

జాతీయ నాయకుల చిత్రపటాల బహూకరణ

గుడ్లూరు: మండలంలోని చినలాటరఫి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చల్లా దేవిక చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్.శ్రీకాంత్ జాతీయ నాయకుల చిత్రపటాలను బుధవారం బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాస్ మాట్లాడుతూ చల్లా దేవిక తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కరోనాతో మృతి చెందగా ఆమె జ్ఞాపకార్థం భర్త శ్రీకాంత్ జాతీయ నాయకుల చిత్రపటాలను అందించడం అభినందనీయమన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



చైర్మన్ గఫార్‌ను సన్మానిస్తున్న హనుమాన్ భజన సంఘం

కనిగిరి రూరల్: పట్టణంలోని హనుమాన్ భజన సంఘం చెట్టు వద్ద శ్రీ రామనవమి కళ్యాణోత్సవాలు పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ భజన సంఘం ఏర్పాటు జరిగి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘ అధ్యక్షుడు గట్టుపల్లి మల్లికార్జున, వెంకటలక్ష్మీ దంపతులను చైర్మన్ గఫార్ సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మణసంఘ రాష్ట్ర యూత్ సెక్రటరీ సంగరాజు సాయి మనోజ్, వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

20వ వార్డులో చైర్మన్ పర్యటన

పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ బుధవారం పర్యటించారు. వార్డు ప్రజలు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పారిశుద్ధ్యంపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి అరుణోధర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణి

గుడ్లూరు: మండలంలోని బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాళ్లపాడు గ్రామానికి చెందిన దగ్గుమాటి సుబ్బారావు అందచేసిన పరీక్షా సామగ్రిని సర్పంచ్ శ్రీనివాసులు బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సలీంబాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపిలో 868 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం కేంద్రం అధికారి ఎస్ రామారావు బుధవారం నిర్వహించిన పొగాకు వేలంలో రైతులు 868 పొగాకు బేళ్లు అమ్ముకున్నారు. వేలంకేంద్రం పరిధిలోని అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాల నుంచి రైతులు 984 బేళ్లు అమ్మకానికి తెచ్చుకున్నారు. వ్యాపారులు 868 బేళ్లు కొనుగోలు చేసి 55 బేళ్లని తిరస్కరించారు. అత్యధిక ధర కేజీ పొగాకు రూ.200 పలకగా అత్యల్ప ధర కేజీ పొగాకు రూ.184 పలికి సరాసరి ధర కేజీ పొగాకు రూ.198.21 రైతుకి దక్కింది.

రైతు ఉత్పత్తిదారుల అవగాహన సదస్సు

మద్దిపూడి: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం రైతు ఉత్పత్తిదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్, వెలుగు ఏపీఎం బాబురావు పాల్గొని మాట్లాడుతూ రైతుల్లో చైతన్యం తీసుకొచ్చి ఉత్పత్తిదారు సంఘాలుగా ఏర్పడాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల వారీగా ఒక్కో గ్రూపు చొప్పున 15 నుంచి 19 మంది రైతులు కలిసి సాగుచేసే పంటల వారీగా కనీసం 10 అంతకంటే ఎక్కువ గ్రూపులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. వారికి అనుకూల బ్యాంక్ ఖాతాను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ముస్తాబైన రామాలయాలు



మద్దిపూడిలో చలువ పందిరి వేస్తున్న నిర్వాహకులు

మద్దిపూడి: నేడు జరుగనున్న శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలు బుధవారం ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా రామాలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మద్దిపూడి పడమటి బజారులోని కోదండరామస్వామి ఆలయం ఎదురు నిర్వాహకులు తాటాకుతో చలువ పందిళ్లు వేశారు. మండలంలోని సన్నమూరు, పొట్టిరెడ్డిపాలెం, అంకేపల్లి, తంగెళ్ల, గార్లపేట, ధర్మవరం తదితర గ్రామాల్లోని ఆలయాలు నూతనశోభను సంతరించుకున్నాయి. సీతాసమేత రాములవారి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కొత్రా లక్ష్మన్నారాయణ శర్మ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పొన్నలూరు జూనియర్ కళాశాల, మాలపాడు కేజీబీవీ విద్యార్థులతో పాటు కందుకూరు మండలం జీ మేకపాడు మోడల్ స్కూల్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు వంద మందికి గాను నలుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 88 మంది గాను ముగ్గురు గైర్హాజరయ్యారని చీఫ్ ఎస్కే రషీద్, డీఓ సీహెచ్ బాబురావు తెలిపారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై డి రాజారావు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు

పామూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు మొత్తం 630 మంది విద్యార్థులకు గాను 43 మంది విద్యార్థులు గైర్హాజరుకాగా 587 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆయా కళాశాల కేంద్రాల్లో డీఓలు కోటిసాహెబ్, రామరాజు, మురళి, చీఫ్ సూపరింటెండెంట్‌లు పీవీ నారాయణ, గుత్తి వెంకట రమణయ్య, హజరత్తయ్య పరీక్షలను పర్యవేక్షించారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సింగరాయకొండ: విద్యార్థినులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కుల సాధించాలని మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ మలినేని పెరుమాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరుమాళ్లు 90 మంది విద్యార్థినులకు రూ.10 వేల విలువైన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేలు, తదితర సామగ్రి అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు రూ.25 వేల విలువైన ప్రైజ్ మనీ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ మూర్తి, ఎంబీఏ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ రాచకొండ శ్రీనివాసరావు, మాథ్స్ లెక్చరర్ కె రవీంద్ర, ఉపాధ్యాయనిలు పాల్గొన్నారు.

పొగాకు అక్రమ అమ్మకాలు చేయరాదు

టంగుటూరు: రైతులు, వ్యాపారులు పొగాకు అక్రమ కొనుగోలు, అమ్మకాలు చేయరాదని, అలా చేసిన రైతు బ్యారన్, వ్యాపారి లైసెన్సులు రద్దు చేస్తారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం కె.ఉప్పలపాడు గ్రామానికి చేందిన రైతులు 1008 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 940 కొనుగోలు జరిగాయి. వివిధ కారణాలతో 68 తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.160 పలకగా, సరాసరి రూ.194.36 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 14 మంది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.